క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: కోనరావుపేట మండలం సుద్దాలలో ఏర్పాటు చేసిన బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్సీరాం విగ్రహావిష్కరణకు బహుజనులు పెద్ద ఎత్తున తరలిరావాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు నీరటి భాను కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడారు. మండలం నుంచి బహుజనులంతా తరలివచ్చి రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్, రమేశ్, రాజు, రఘు పాల్గొన్నారు.

పూలే జయంతి ఉత్సవాలకు తరలిరండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రుద్రంగి: ఉమ్మడి కరీంనగర్ జిల్లా బహుజన సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 11న కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయంలో నిర్వహించే మహాత్మా జ్యోతిబాపూలే 196వ జయంతి ఉత్సవాలను పార్టీలకు అతీతంగా మేధావులు, విద్యావంతులు, ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బహుజన సంఘాల ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మారంపెల్లి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమం నాయకులు చిత్తిపాక మల్లయ్య, గసికంటి గంగారెడ్డి, తర్రె మనోహర్, దర్న మల్లేశం, సింగారం గంగారెడ్డి, పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకుందాం



ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న సర్పంచ్

ముస్తాబాద్: ఇంకుడు గుంతల నిర్మాణాలతో భూగర్భ జలాలను పరిరక్షించుకోవాలని మోహినికుంట సర్పంచ్ కల్వకుంట్ల వనజ కోరారు. మోహినికుంట బుడగ జంగాల కాలనీలో సంచార కుటుంబాలు నిర్మించుకుంటున్న ఇంకుడు గుంతలను శుక్రవారం పరిశీలించారు. మోహినికుంటలో ఇంటికో ఇంకుడు గుంత నిర్మించుకున్నారని.. కొత్తగా ఏర్పాటైనా బుడగ జంగాల కాలనీలో కుటుంబాలు ఇంకుడు గుంతల నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. వృథా నీటిని భూమిలోకి పంపించడమే కాకుండా, దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా మురుగు నీటి బాధలు లేకుండా ఇంకుడుగుంతలు ఉపయోగపడుతాయన్నారు.

గుంతలను వదిలేసి.. బాగున్నచోట తారు పోసి..



ఇది రుద్రంగి మండల కేంద్రంలోని ఆంధ్రాబ్యాంక్ ఎదుట ఉన్న కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారి. రోడ్డు గుంతలమయంగా మారి, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోకాలి లోతు గుంతల్లో ప్రయాణికులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని, ప్రయాణం చేస్తున్నారు.



ఇది రుద్రంగి మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదుట గల కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారి. రోడ్డు పూర్తిగా శిథిలమై, ప్రయాణం నరకాన్ని తలపిస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో గుంతలు కనబడక ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు.

- కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారికి ఇటీవల మరమ్మతు
- కంకర తేలిన రోడ్డుపై ప్రయాణికుల ఇబ్బందులు
- రుద్రంగి మండల కేంద్రంలో పరిస్థితి

రుద్రంగి(వేములవాడ): మండల కేంద్రంలో కోరుట్ల–వేములవాడ రహదారి శిథిలమై ఏళ్లు గడుస్తోంది. తప్పని పరిస్థితుల్లో ఈ రోడ్డుపైనే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతూ ప్రయాణం చేస్తున్నారు. రహదారి పరిస్థితిని ఎవరూ పట్టించుకోవడం లేదని అంటున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో భయంభయంగా ప్రయాణం సాగిస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

గుంతలను వదిలేశారు..

ఇటీవల కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారికి మరమ్మతు చేపట్టారు. దీంతో రుద్రంగి ప్రజలతోపాటు ప్రయాణికులు శిథిలమైన రోడ్డుపై ఏళ్లుగా పడుతున్న ప్రయాణ కష్టాలు తీరుతాయని సంబరపడ్డారు. కానీ మరమ్మతు చేసినవారు పూర్తిగా శిథిలమైన చోట కాకుండా బాగున్నచోట తారు పోసి, వెళ్లిపోయారు. దీంతో ప్రయాణికుల ఇబ్బందులు ఎప్పటిలాగే ఉండిపోయాయి. ఈ రోడ్డు మరమ్మతుకు గత డిసెంబర్‌లోనే నిధులు మంజూరయ్యాయి. అధికారుల నిర్లక్ష్యం, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పనులు పూర్తిస్థాయిలో జరగడం లేదని స్థానికులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.



గుంతలు పడి, తారులేచి ప్రయాణానికి వీలులేకుండా ఉన్న ఈరోడ్డు రుద్రంగి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా ఆవరణలోనిది. కొన్నేళ్లుగా రోడ్డు ఇలాగే ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో ప్రయాణికులు ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే నిత్యం నరకం చవిచూడాల్సి వస్తోంది.

ప్రమాదాలు జరుగుతున్నాయి



రుద్రంగిలో అధ్వానంగా ఉన్న రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో భారీ గుంతలు కనిపించక వాహనదారులు కింద పడి, గాయాలపాలవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా రోడ్డును బాగు చేయించాలి.

– గాజ నర్సయ్య, ప్రయాణికుడు, రుద్రంగి

త్వరలో పనులు ప్రారంభిస్తాం



శిథిలమైన రోడ్డును బాగు చేసేందుకు 450 ట్రిప్పుల మెటల్ అవసరమవుతుంది. అందుకే అక్కడ తారు పోయడం వదిలేసి, దారికి అవతలివైపు, ఇవతలివైపు పోశాం. మెటల్ కోసం అధికారులను సంప్రదించాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– సతీశ్, ఆర్అండ్‌బీ ఏఈ

గుడ్ ఫ్రైడే వేడుకలు



కోనరావుపేట/తంగళ్లపల్లి: కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి, కోనరావుపేట, నిజామాబాద్ తదితర గ్రామాల్లో , తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లి గ్రామంలోని బేతెస్థ మందిరంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. నిమ్మపల్లిలోని గుడ్‌న్యూస్ బాప్టిస్ట్ చర్చిలో జరిగిన వేడుకల్లో ఏసుక్రీస్తు సిలువలో పలికిన మాటలను, శాంతిమార్గంలో నడిచిన విధానాన్ని పాస్టర్ బి సోమయ్య వివరించారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ విజయలక్ష్మి, సంఘ పెద్దలు ఆనందం, రాజు, ఇస్సాక్, అనూక్, కృపరాజు, దేవదాస్, ప్రసాద్, శేఖర్, దేవయ్య, విజయ్, శారా, శాంతి, నయోమీ విశ్వాసులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు కంపు



వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని వేములవాడ–సిరిసిల్ల రహదారిలోని వేములవాడ ఏరియా ఆసుపత్రి ఎదుట మురుగు నీటి కాలువ అగి రోడ్డుపై పారుతోంది. పది రోజులగా మురుగు నీరు ఇ ముందు, దుకాణాల ముందు, రోడ్డుపై అగి మురికి కంపుకొడుతున్నాయి. స్థానికులు ఇండ్లలోకి వెళ్లలంటే మురుగు నీటిలో బండరాళ్లు వేసుకుని నడుస్తున్నారు. రాత్రి పూట మురికి కంపు, దోమలతో ఇబ్బంది అవుతుందాని అవేదన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకుని మురికి కాలువలు శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

మొక్కలకు రక్షణ చర్యలేవి..?



చందుర్తి: చందుర్తి మండలం ఎన్గల్ –మర్రిగడ్డ గ్రామాల మధ్య రోడ్లకు ఇరువైపులా హరితహారంలో నాటిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు ఏటా వేసవికాలంలో అగ్నికి ఆహుతవుతున్నాయి. హరితహారంలో మూడు సంవత్సరాల క్రితం నాటిన ఈ మొక్కలు నాటారు. ప్రస్తుతం పెరిగి చెట్లుగా మారాయి. వాటి పక్కనే పీకి వేసిన పత్తి కట్టెలను కుప్పలను కాల్చి వేసేందుకు నిప్పు పెడుతున్నారు. ఆ వేడికి చెట్లు ఎండిపోతున్నాయి. చెట్ల కింద పత్తి కట్టెలను తగులబెట్టే రైతులపై చర్య తీసుకుంటే ఇక ముందు ఇలా చేయకుండా నియంత్రించాలని పలువురు భావిస్తున్నారు.

అటెన్షన్ ప్లీజ్



రోడ్డు పక్కనే పాత బావి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రం శివారులోని ప్రధాన రహదారి పక్కనే పాత బావి ప్రమాదకరంగా మారింది. ఎల్లారెడ్డిపేట నుంచి వీర్నపల్లికి వెళ్లే ప్రధాన రహదారిని అనుకోని ప్రమాదకరంగా ఉన్న ఈ బావిని పూడ్చివేయాలని ప్రజలు చేస్తున్న వినతులను ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవటం లేదు. కనీసం అక్కడ హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటు చేయలేదు. ఫలితంగా రాత్రివేళ కొత్తవారు ఈ దారిలో ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు పక్కనే ఉన్న ఈ బావిని పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: కిరణ్, ఆర్అండ్‌బీ శాఖ, ఏఈ
ఫోన్ నంబర్: 94408 18864

కిషోర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

కోనరావుపేట: మండలం జైసేవాలాల్ భుక్యారెడ్డి తండాకు చెందిన భుక్యా కి షోర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. మరిమడ్లలో విద్యుత్ షాక్‌తో మృతి చెందగా శుక్రవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబం, కుటుంబ యజమాని మృతి చెందడంతో వీదిన పడ్డ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట మండలశాఖ అధ్యక్షుడు షేక్ పిరోజ్‌పాషా, నాయకులు పుంగం గౌడ్, చెప్యాల రాజు ఉన్నారు.

ట్రాక్టర్ బ్యాటరీల అపహరణ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిర, నారాయణపూర్ గ్రామాల్లో వ్యవసాయ పంట పొలాల వద్ద ఉన్న ట్రాక్టర్ల బ్యాటరీలు, గొర్రులు, ఇతర విడి భాగాలను, మానేరు వాగు వెంట ఉన్న కరెంట్ మోటర్లను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి అపహరించుకు వెళ్లారు. బాధిత రైతులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు గ్రామాలకు చెందిన ఆరుగురు రైతులకు సంబంధించిన ట్రాక్టర్ల విడి బాగాలను, రెండు విద్యుత్ మోటార్లను ఎత్తుకెళ్లారు. ఏడాది క్రితం ఇదేవిధంగా రాజుతో పాటు రాగట్లపల్లిలో ఐదు విద్యుత్ మోటార్లను, ట్రాక్టర్ల బ్యాటరీలు, వైర్లు, గొర్రులు అపహరించుకెళ్లారు. రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం పట్టివేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్‌లోని మానేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న పికప్ వాహనాన్ని శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అంకిరెడ్డిపల్లికి చెందిన సెల్ల రఘు అనే డ్రైవర్ పికప్ వాహనంలో ఇసుకను తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు వాహన తనిఖీలు చేపట్టగా, అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఈ వాహనాన్ని పట్టుకున్నారు. వెంకటాపూర్ నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రానికి ఇసుకను అధిక ధరకు తరలిస్తున్నట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి ఠాణాకు తరలించి డ్రైవర్ రఘుతో పాటు వాహన యజమాని గండికోట అశోక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిరుపయోగంగా ప్రయాణ ప్రాంగణాలు

- కొన్ని గ్రామాల్లో బస్టాండ్‌లు లేవు
- మరికొన్ని గ్రామాల్లో నిరుపయోగం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



శిథిలావస్థకు చేరుకున్న కొలనూర్ బస్టాండ్

కోనరావుపేట: మండలంలోని గ్రామాల్లో ప్రయాణ ప్రాంగణాలు లేక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. చాలా గ్రామాల్లో బస్టాండ్‌లు లేక అవస్థలు పడుతుంటే ఉన్న కొద్ది గ్రామాల్లో నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రస్తుతం ఎండాకాలం ప్రారంభం కావడంతో వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

కోనరావుపేట మండల కేంద్రంలో అందమైన ప్రయాణ ప్రాంగణం ఉంది. కాని ఒక్క బస్సు కూడా ఈ ప్రాంగణంలో ఆగదు. అలాగే ఒక్క ప్రయాణికుడు కూడా ఇక్కడ ఉండరు. బస్సు డ్రైవర్లు సైతం బస్‌స్టేషన్‌లో ఆపాల్సిన బస్సులను, కొంతముందుకు వెళ్లి హోటళ్ల ముందు ఆపుతున్నారు. దీంతో ప్రయాణికులు బస్టాండులోకి వెళ్లకుండా, హోటళ్ల వద్ద బస్సెక్కాల్సి వస్తోంది. ఇలా ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా బస్‌స్టేషన్ నిరుపయోగంగా మారింది.

అపహరణకు గురైన సామగ్రి

బస్టాండ్‌లో మిగిలి ఉన్న సామగ్రి దొంగల పాలయ్యింది. మాజీ సర్పంచ్ విజయ భర్త బొమ్మ విశ్వేశం సొంత ఖర్చులతో బస్టాండ్‌లో టెలివిజన్‌తో పాటు ఒక ఫ్యాన్ ఏర్పాటు చేయించారు. ఆ తర్వాత కొద్ది రోజులకే ఫ్యాన్, ఇతర విద్యుత్ పరికరాలు గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. మిగిలిన టీవీని విశ్వేశం తన ఇంట్లో భద్రపరిచాడు. ఆ తర్వాత టీవీ స్టాండ్‌ను కూడా దొంగలు వదల్లేదు.

శిథిలావస్థలో బస్టాండ్‌లు

మండలం కొలనూర్‌లోని ప్రయాణ ప్రాంగణం శిథిలావస్థకు చేరుకుంది. 1995లో అప్పటి జెడ్పీటీసీ గొట్టె రుక్మిణి, ఎంపీపీ అబ్బసాని శంకర్‌గౌడ్ హయాంలో నిర్మించగా ప్రస్తుతం పగుళ్లు ఏర్పడుతోంది. బస్టాండ్‌కు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో అది శిథిలావస్థ చేరుకుంది.

➡ మండలంలోని మర్తనపేట, ధర్మారం, నిజామాబాద్, మామిడిపల్లి, బావుసాయిపేట, నాగారం గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకున్నాయి.

➡ మరిమడ్ల, కనగర్తి, వట్టిమల్ల, అజ్మీరాతండా, రెడ్డితండా, తదితర గ్రామాల్లో ప్రయాణ ప్రాంగణాలే లేవు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఎండాకాలం కాబట్టి మరిన్ని ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. మండలంలోని స్థానిక పాలకులు స్పందించి ప్రయాణ ప్రాంగణానికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎండాకాలం ఇబ్బందే



గ్రామాల్లో ఉన్న ప్రయాణ ప్రాంగణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటికి ఎలాంటి మరమ్మతులు చేపట్టడం లేదు. రానున్న రోజుల్లో ఎండాకాలం ప్రారంభమైతే ప్రయాణికులు ఇబ్బంది పడే అవకాశం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

– వీరవేణి తిరుపతి, కొలనూర్

సిబ్బందికి ఆదేశాలిస్తాం

గ్రామాల్లో బస్టాండ్‌లు ఉన్న స్థలాల్లోనే బస్సులు ఆగాలి. అయితే ఈ బస్టాండ్‌ల వద్ద బస్సులు ఆగడంలేదన్న విషయం నా దృష్టికి రాలేదు. ప్రయాణ ప్రాంగణాలు ఉన్న చోట తప్పకుండా బస్సులు ఆగేలా చూస్తాం. ఈ విషయమై డ్రైవర్లకు తగిన సూచనలు చేసి ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చూస్తాం.

– మనోహర్, ఆర్టీసీ డీఎం, సిరిసిల్ల

కోతుల బెడద నివారణ చర్యలు

- ముస్తాబాద్ ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్: పట్టణ వాసులకు కోతుల నుంచి బెడద లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. కోతుల దాడుల్లో పదుల సంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారని, పొలాలకు, కూరగాయల తోటలకు రక్షణ లేకుండా పోయిందని చాలా మంది ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసి కోతులను పట్టుకునే నిపుణులను రప్పించినట్లు తెలిపారు. రెండు వేల వరకు ఉన్న కోతులను ప్రత్యేక బోనుల ద్వారా పట్టుకుని అటవీ ప్రాంతాలకు ప్రత్యేక వాహనంలో తరలిస్తారని అన్నారు.



కోతులను పట్టే విధానాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

అందుకయ్యే ఖర్చు తానే భరిస్తున్నట్లు తెలిపారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఉపసర్పంచ్ రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న వైద్య, జీపీ సిబ్బంది, నాయకులు

రుద్రంగి: మండలంలోని బడితండా గ్రామంలో గ్రామ వైద్య సిబ్బంది, గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ తీసి ప్రజలకు ఆరోగ్యవంతమైన జీవనం గడిపేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ వైద్య సిబ్బంది ఏఎన్ఎం, ఆశాలు, జీపీ సిబ్బంది, నాయకులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.